సౌకర్యాలు నిల్..
క్రీడాకారులు డల్!

- హుడా పార్కులోని క్రీడా మైదానంలో కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
- వసతులు కల్పిస్తే క్రీడల్లో రాణిస్తామంటున్న వైనం


ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్ కాలనీ మధ్య ఉన్న హుడా పార్కులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు




పార్కు మైదానంలో ప్రమాదకరంగా కిందకు ఉన్న ఫ్యూజ్ బాక్స్

ఆల్విన్‌కాలనీ: క్రీడా స్థలాల్లో వసతులు లేక క్రీడాకారులు పోటీల్లో పాల్గొనలేని పరిస్థితి నెలకొంటోంది. క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాలన్న ఆసక్తి ఉన్నా క్రీడాకారులకు అనాశక్తిగానే మిగిలిపోతోంది. తర్ఫీదు పొంది పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిని వారు ఉన్నారు. కానీ ఈ ప్రాంతంలో తర్ఫీదు లేకుండానే క్రీడల్లో రాణించి స్వయంగా ట్రెనింగ్ పొంది ఎన్నో బహుమతులు గెలుచుకున్న వారూ ఉన్నారు.

◆ కూకట్‌పల్లి జగద్గిరిగుట్ట ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, రిక్షాపుల్లర్స్ కాలనీ, వెంకటేశ్వరనగర్, రామకృష్ణనగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో వివిధ గ్రామాల నుంచి ఉపాధి కోసం వచ్చి ఈ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరిలో అనేక మంది షటిల్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో వంటి అనేక క్రీడల్లో ఆసక్తి చూపుతున్నారు. ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్ కాలనీ మధ్య ఉన్న హుడా పార్కులో రెండెకరాల మైదానంలో క్రీడాకారులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ రకాల క్రీడల్లో తర్ఫీదు పొందుతున్నారు.

◆ కానీ వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రొత్సాహకాలు, సౌకర్యాలు అందటం లేదని వాపోతున్నారు. గ్రామాలలో పాఠశాలలో, కళాశాలలో వివిధ క్రీడల్లో రాణించిన యువకులు ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని చదువుకుంటు, ఉపాధి పొందుతున్న వారు ఉన్నారు. కానీ వీరు క్రీడల్లో రాణించటానికి సౌకర్యాలు, శిక్షణ, పోటీల్లో పాల్గొనటానికి ఎవరూ ప్రోత్సాహించకపోవటంతో నిరాశకు లోనవుతున్నారు. బహుమతులు, అవార్డులు, రివార్డులు పొందిన వారు కూడా ఉన్నారు.



◆ ప్రస్తుతం వీరికి ఈ ప్రాంతంలో క్రీడలు నిర్వహించే వారు లేక వీరి ప్రతిభ కనుమరుగై పోయే పరిస్థితి నెలకొంది. గతంలో మాజీ శాసనసభ్యులు భిక్షపతి యాదవ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు గత 15 సంవత్సరాల క్రితం ఈ మైదానంలో లైటింగ్, సౌకర్యాలు వంటివి కల్పించారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ మైదానంలో ఎలాంటి సౌకర్యాలు చేపట్టలేదు. ఉన్న అరకొర సౌకర్యాలు కూడా ప్రమాదకరంగా మారాయి. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అవి సైతం పాడైపోయి అపరిశుభ్రంగా మారాయి. నేడు అవి కూడా కనుమరుగై పోయాయి.

వసతులు కల్పించాలి



యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తేవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రోత్సహించే వారు లేక ఉన్న క్రీడాకారులు కూడా కనుమరుగై పోతున్నారు. క్రీడామైదానంలో వసతులు కల్పించి క్రీడాపోటీలు నిర్వహించే సమాచారాన్ని ఇక్కడి క్రీడాకారులకు అందించి పాల్గొనేలా ప్రోత్సహిస్తే రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవటానికి సిద్ధంగా ఉన్నాం.

– సాగర్, క్రీడాకారులు, పాపిరెడ్డినగర్

◆ ఈ మైదానంలో క్రీడాకారులకు త్రాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్, క్రీడా సామగ్రి, శిక్షకులు వంటి సౌకర్యాలు కల్పించి ఇక్కడ ఉన్న యువతను ప్రోత్సహించి జిల్లా, రాష్ట్ర, దేశస్థాయిలో పోటీల్లో పాల్గొనేలా సౌక్యాలు కల్పించి ప్రోత్సాహించాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, యువత ప్రభుత్వ ఉన్నతాధికారులను, స్థానిక ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిబ్రవరి 4న అవంతినగర్ తోట ఎన్నికలు

మోతీనగర్: అవంతినగర్ తోట అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సయ్యద్ బాబులుపేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కమ్యూనిటీహాల్‌లో సర్వసభ్య సమావేశం ప్రధాన కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా కాలనీలో గత రెండు సంవత్సరాల నుంచి మృతి చెందిన సభ్యులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కాలనీలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చించారు. లావాదేవీలపై, రాబోయే ఎన్నికలపై చర్చించారు. ఈ నెల 29, 30 తేదీల్లో నామినేషన్లు, 31న ఉప సంహరణ, ఫిబ్రవరి 4న స్థానిక కమిటీహాల్‌లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఈ ఎన్నికలకు అధికారులుగా మాజీ పోలీస్ అధికారి దత్తాత్రేయ, ఎల్‌ఐసీ కృష్ణ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కార్పొరేటర్ సబిహాబేగంకు రాజీవ్‌గాంధీనగర్ వాసుల వినతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్ వాసులు ఆదివారం కార్పొరేటర్ సబిహా బేగంను కలిశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలనీ రోడ్లపై మురుగు పారుతోందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జలమండలి అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. సమస్యను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరించాలని కోరనున్నట్లు తెలిపారు. అనంతరం సీసీ రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ సలావుద్దీన్, సాదిక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు


కరాటేలో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించిన నియుధ లీమార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు

మూసాపేట: షాపూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన కరాటే చాంపియన్‌షిప్‌లో భరత్‌నగర్‌కు చెందిన కరాటే విద్యార్థులు 7 గోల్డ్ మెడల్స్ సాధించారు. భరత్‌నగర్ కాలనీలోని నియుధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో 17 మంది 3వ నేషనల్ లెవెల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. వీరిలో 7 మందికి గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, 4 కాంస్య మెడల్స్ సాధించారని కోచ్ సంతోష్ కుమార్ తెలిపారు. తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేశారని ఆయన అన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడే బాధ్యత తీసుకుంటా

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్


ఆదిత్యనగర్, అడ్డగుట్టకాలనీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్, అడ్డగుట్ట కాలనీ అసోసియేషన్ సభ్యులతో కాలనీలో ఉన్న పార్కులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్యనగర్, అడ్డగుట్టకాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, కమ్యూనిటీహాల్ నిర్మాణం, అంబీర్ చెరువు, ప్రభుత్వ భూములు, కాలనీలో ఉన్న పార్కు స్థలాలు కబ్జాకు గురైన విషయాలను కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

◆ ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు ఎవరైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నేడు మనం చేసే పనులు రాబోయే తరాలకు మేలు జరిగేలా ఉండాలన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు మంచి జరిగేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, భారత్, భగవాన్ నాయుడు, ఎస్.వి. రావు, సాయి రాజు, లక్ష్మణ్ రావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సైబర్‌సిటీ ఎస్‌ఈ ఆరా

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని చందానగర్ విద్యుత్ సెక్షన్‌లోని ఆర్టీసీ కాలనీలో ఆదివారం సైబర్‌సిటీ ఎస్‌ఈ వెంకన్న పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ సమస్యలపై ఆయన ఆరా తీశారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై అధికారులు వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ భాగ్యనగర్ ఫీడర్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ, తరుణి సూపర్ మార్కెట్, అల్లూరి ట్రేడ్ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు. , ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని ఆదిత్యనగర్, శుభోదయా కాలనీ, ప్రసాద్ ఆస్పత్రి వెనుక వైపు, హెచ్‌ఎంటీహిల్స్ కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

30 నుంచి శివపురాణ ప్రవచనం

మోతీనగర్: మోతీనగర్‌లో నెలకొనియున్న శ్రీశృంగేరి శారద శంకరామఠంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు నిట్టల కిరణ్మయిచే శ్రీశివపురాణం ప్రవచనం నిర్వహించనున్నట్లు శంకర మఠం కార్యనిర్వాహణ అధికారి సీఎస్ ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ఈ ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

డా. మల్లు రవికి శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన డా. మల్లు రవిని ఆదివారం టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ డా. మల్లు రవి తెలంగాణ భవన్‌లో రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ చేతుల మీదుగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. మల్లు రవి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కుల గురించి, పెండిగ్ ప్రాజెక్టులతో పాటు, రైల్వే లైన్లు, ఇండస్ట్రియల్ తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచారం కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మల్లు రవికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సత్యం శ్రీరంగం

విజయనగర్‌కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి సమస్యలను వివరిస్తున్న విజయనగర్ కాలనీవాసులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్‌కాలనీలోని పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కాలనీవాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్‌కాలనీలో నెలకొన్న పలు సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో రోడ్ల పనులు చేపడతామన్నారు. త్వరలో కాలనీలో పర్యటించి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. అదే విధంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపేట వేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా నారాయణ పాఠశాల వార్షికోత్సవం





కూకట్‌పల్లి: నారాయణ పాఠశాల, కేపీహెచ్‌బీ బ్రాంచ్‌లో ఆదివారం వార్షికోత్సవ వేడుకలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారాయణ విద్యా సంస్థల డీజీఎం గోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌డీ డిపార్టుమెంట్ లక్ష్మి, హైస్కూల్ హెచ్‌ఎం మాలతి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం లావణ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైజయంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయటం గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమంలు విద్యార్థులను భాగస్వాములను చేయటం ద్వారా వారిలో మానసిక చైతన్యం, పరిపక్వత లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఏ సమస్యలు ఉన్నా నా దృష్టికి తేవాలి


బాలానగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఆదివారం బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ల వారీగా కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలనీవాసులు ఎవరూ కూడా ఇబ్బంది పడకుండా వారి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించే మార్గం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమవుతూ వారికున్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని బండి రమేష్ పేర్కొన్నారు.

హాకీ పటిష్టతకు కృషి చేస్తా

తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: రాష్ట్రంలో హాకీ క్రీడ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లోని ఆయన నివాసంలో హైదరాబాద్ నగరానికి చెందిన పలు హాకీక్లబ్‌ల కెప్టెన్లతో కలిసి హాకీక్రీడ పటిష్టతతో పాటు పలు సదుపాయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హాకీని దేశంలోనే ప్రథమ స్థానంలో తీసుకురావడం కోసం హాకీ క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. జాతీయ హాకీ జట్టులో తెలంగాణ హాకీ క్రీడాకారుల ప్రాతినిధ్యం తదితర అవకాశాలపై చర్చించామన్నారు. చిన్నారులను హాకీ వైపు మళ్లించేలా ప్రతి పాఠశాలలో వ్యాయమా ఉపాధ్యాయులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. జాతీయ హాకీ షెడ్యూల్ ప్రకారం టోర్నమెంట్ నిర్వహణకు రాష్ట్ర ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. గురునానక్ హాకీ క్లబ్ అధ్యక్షులు గురుబచన్ సింగ్, రంజిత్ సింగ్, జలపిర్ సింగ్, కోచ్ తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు చేయించుకున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: మూసాపేటలోని నవయువక యూత్ అసోసియేషన్ వద్ద తూము శ్రావణ్‌కుమార్ యువసేన ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆస్పత్రి వారు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. డివిజన్‌లోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, శ్రీనివాస్, బాబూరావు, రాజు, రాము, వెంకటస్వామి, జైరాజ్, శ్యామల, సుజా, పద్మ, శిరీష, శివాని తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నిర్మించారు.. మరోటి వదిలేశారు!

- గచ్చిబౌలి డివిజన్‌కు రెండు మోడల్ మార్కెట్లు మంజూరు
- రెండో మార్కెట్ స్థల పరిశీలనకే పరిమితం
- ఆరేళ్ల క్రితం ప్రతిపాదనల్లో ఫలితం శూన్యం



రాయదుర్గం: ఉన్నత ఆశయంతో లక్షల రూపాయలు వెచ్చించినా.. ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. గచ్చిబౌలి డివిజన్‌కు ఆరేళ్ల క్రితం రెండు మోడల్ మార్కెట్లు మంజూరయ్యాయి. కాగా ఈ రెండింటిలో ఒకటి టీఎన్‌జీకాలనీకి మంజూరు చేయగా.. స్థలాన్ని కేటాయించారు. రెండోది ఖాజాగూడలో నిర్మించాలని అనుకున్న స్థలం విషయంలో కొత్త సమస్యలు తలెత్తడంతో దీన్ని ప్రతిపాదలనకే పరిమితం చేశారు. దీంతో టీఎన్‌జీఓ కాలనీకి మంజూరైన మోడల్ మార్కెట్ కోసం భవనాన్ని నిర్మించారు. కానీ ఇందులో దుకాణాలు పెట్టేందుకు ఎవరూ.. ముందుకు రాకపోవడంతో నిర్మాణం చేసినా తాళాలు వేసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మాణం..

◆ కొమిరిశెట్టిసాయిబాబా ప్రత్యేక చొరవతో రెండు మోడల్ మార్కెట్ల నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేయించారు. టీఎన్‌జీఓకాలనీలో పదేళ్ల క్రితం రూ.50 లక్షలు వెచ్చించి చక్కటి భవనాన్ని నిర్మించారు.

◆ ఈ భవనంలో దుకాణాలు రెండంతస్తులతో నిర్మించారు. ఈ భవనంలోనే దుకాణాలు నిర్వహించేవారికి బాత్‌రూమ్, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చుట్టూ ప్రహరీని కూడా నిర్మించారు.

◆ అనంతరం కాలనీకి నిర్మాణం చేసిన సమయంలో దూరంగా ఉండటంతో ఎవరూ.. దుకాణాలు అద్దెకు తీసుకురావడానికి ముందుకు రాలేదు. దీంతో అది కాస్తా తాళాలు వేసి ఉంచాల్సి వచ్చింది.

◆ ప్రస్తుతానికి చేరువలో ఇళ్ల సంఖ్య గణనీయంగా పెరిగినా.. కూడా దుకాణాల నిర్వహణకు ఎవరూ.. ముందుకు రాకపోవడంతో తాళాలు వేసి ఉంచాల్సి వచ్చింది.

◆ ప్రస్తుతం ప్రహరీ లోపల పిచ్చిమొక్కలు చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రస్తుతం పెద్ద ఎత్తున కాలనీ ఏర్పడినా దీన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టలేదు.

స్థల వివాదంతో వెనక్కి..

◆ ఖాజాగూడలో కేటాయించిన స్థలం విషయంలో స్థానికులు కొందరు వ్యతిరేకించడంతో దాన్ని విరమించి అనువైన చోటును పరిశీలించాలని నిర్ణయించారు. కానీ అనువైన స్థలం కేటాయించక పోవడంతో అది కాస్తా ప్రతిపాదనలకే పరిమితమైంది. కేటాయించిన రూ.50 లక్షల రూపాయలు మరుగున పడ్డాయని సమాచారం. ఇప్పట్లో మంజూరు అయ్యే పరిస్థితి కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రతిపాదనలు..

◆ భవన నిర్మాణం చేసినా మోడల్ మార్కెట్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

◆ ఈ మోడల్ మార్కెట్ భవనాన్ని జీహెచ్‌ఎంసీ ద్వారా ఇతర అవసరాలకు వినియోగించేలా మార్పులు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

◆ రూ.50 లక్షలను వెచ్చించి నిర్మించినందున కనీసం జీహెచ్‌ఎంసీకి అద్దె అన్నా వచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

◆ మినీ రైతు బజారుగా మార్చి ప్రతి నిత్యం కూరగాయలు,ఆకుకూరలు,ఇతర వస్తువులు అందుబాటులో ఉంచేలా చేస్తే ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలను అందజేస్తున్న సైబేజ్ కంపెనీ ఉద్యోగులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని 9వ ఫేజ్‌లోని సహృదయ వృద్ధాశ్రమానికి గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆదివారం సైబేజ్ ఆశ ప్రోగ్రాం ద్వారా ఒక నెలకు కావాల్సిన నిత్యావసరాలు అందజేసినట్లు సైబేజ్ కంపెనీ సీనియర్ సీఎస్‌ఆర్ ఎగ్జిక్యూటీవ్ అనపురపు సురేష్ తెలిపారు. సహృదయ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు హకీం మాట్లాడుతూ.. నిత్యావసర సరుకులు అడిగిన వెంటనే అందించినందుకు సైబేజ్ కంపెనీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సైబేజ్ కంపెనీ సురేష్ మాట్లాడుతూ సైబేజ్ కంపెనీ ఇలా అనాథ ఆశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు చేయూత ఇవ్వటంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. భవిష్యత్‌లో కూడా ఆశ్రమానికి కావాల్సిన సదుపాయాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడి వారి యోగాక్షేమాలు తెలుసుకున్నారు. వారంతంలో వృద్ధులతో కొంత సమయం గడపటం ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సైబేజ్ కంపెనీ ఉద్యోగులు సింధు, గైతమి, గోపీకృష్ణ, వెంకటేష్, కార్తిక్, హరీష్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు బీఎస్‌ఎఫ్ మద్దతు

రాయదుర్గం: తెల్లాపూర్‌లోని కూడలిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటుకు హెచ్‌సీయూలోని బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్‌ఎఫ్) సంపూర్ణ మద్దతు ఇస్తుందని యూనియన్ ప్రతినిధుల బృందం ప్రకటించారు. తెల్లాపూర్ కూడలిలో తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ కొల్లూరి భరత్ చేపట్టిన ఆమరణ దీక్షకు కూడా మా మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని, ఇలాంటి విగ్రహాలను పెట్టి వారిని గౌరవించుకోవడం అవసరమని, ఈ విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. గద్దర్ స్మృతివనం ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెల్లాపూర్‌లో చేసే ఉద్యమానికి నిరంతరం బీఎస్‌ఎఫ్ పూర్తి మద్దతును ఇస్తుందని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ బీఎస్‌ఎఫ్ నాయకులు పరుశురామ్, ప్రసన్న, విమల, అంజి, అనీల్, శంకర్, జగదీష్ పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధన సంకీర్తనోత్సవాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. జంటనగరాల్లోని కర్ణాటక సంగీత కళాకారులు గళార్చనతో కార్యక్రమాన్ని నిర్వహించారు. 500 మందికి పైగా సంగీత విద్వాంసులు కలిసి త్యాగరాజస్వామి రచించిన ఘనరాగ పంచరత్న కృతులను, గాత్రం, వేణువు, వీణ, వయోలిన్, మృదంగం, ఘటం, మోర్సింగ్ వంటి వాయిద్యాల సహకారంతో కీర్తిస్తూ.. సందర్శకులను రంజింపజేశారు. సంస్కృతి ఫౌండేషన్ సభ్యులు ప్రముఖ సంగీత విద్వాంసులు కళారత్న విద్వాన్ మోదుమూడి సుధాకర్‌కి గురుసత్కారం చేసి, పలువురు కళాకారులను సత్కరించారు. సందర్శకులు, విద్వాంసులు తదితరులు పాల్గొన్నారు.